క్లుప్తంగా

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



అజ్జాడ డీపీఈపీ పాఠశాలలో అక్షరాభ్యాసం చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్

బలిజిపేట: మండలంలోని అజ్జాడ డీపీఈపీ పాఠశాలలో 9మంది విద్యార్థులు ఒకటవ తరగతిలో చేరడంతో వారికి ప్రధానో పాధ్యాయుడు ఎస్.వెంకటేష్ సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మండల పరిషత్ ఫౌండేషనల్ ప్రాథమిక పాఠశాలలో 1,2తరగతులు మాత్రమే నిర్వహిస్తారు. దీంతో మూకుమ్మడిగా పాఠశాలలో 9మంది విద్యార్థులు బుధవారం చేరడంతో తల్లిదండ్రుల విన్నపంతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఊక లారీలతో అవస్థలు



ఒకవైపు ఊక లారీ, ఎదురుగా గొర్రెలతో ప్రమాదకర ప్రయాణం

పార్వతీపురం: అసలే ఇరుకు రోడ్లు..అపై అతి భారీ వాహనాలు..దీంతో రాకపోకలు చేసేందుకు ఇటు వాహన చోదకులు, అటు పాడిరైతులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారులోని అంతర్రాష్ట్ర రహదారి పరిధిలో ఒక వైపు ఊక లారీ వస్తుండగా ఎదురుగా గొర్రెలను మేతకు పొలాలకు తోలుతున్న సమయంలో రహదారిగుండా ప్రమాదకరంగా వెళ్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. అతి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం: అక్రమాలకు పాల్పడుతున్న చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ చైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న ఆక్రమాలను వెలికి తీసేందుకు ప్రయత్నించిన ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతియుతంగా విజయవాడలోని బందర్ రోడ్‌లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు అత్యుత్సాహంతో దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అరెస్టు చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులను విడుదల చేయాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బూర్జ పరిధిలో విద్యుత్ అంతరాయం నేడు

సీతానగరం: మండలంలోని బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ (33 కేవీ/11 కేవీ) పరిధిలో ఉన్న గ్రామాల వినియోగదారులకు గురువారం విద్యుత్ సరఫరాలో కలగనున్న అంతరాయానికి చింతిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 24 గంటల విద్యుత్ లైన్‌కు సంబంధించిన పనుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన టీకాలు, మందులు, రిఫ్రిజిరేటర్

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎంఆర్ నగరంలో గల పశు వైద్యకేంద్రంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిందని పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో వైద్యశాలలో ఐస్ లైన్ రిఫ్రిజిరేటర్‌తో పాటు మరికొన్ని పరికరాలు దగ్ధమయ్యాయన్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం వైద్యశాలకు తాళాలు తీసిన క్రమంలో అప్పటికే రిఫ్రిజిరేటర్‌తో పాటు ఫ్యాన్ కరెంట్ లైన్ కాలిబడిపోయాయని విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ మూలంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదం మూలంగా రిఫ్రిజిరేటర్, ఐఎల్ఆర్ పూర్తిగా కాలి బూడిదవడంతో పశువులకు సంబంధించి నిత్యం భద్రపరచాల్సిన అనేక వ్యాక్సిన్లు శీతలీకరణ లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. జరిగిన ప్రమాదంపై శాఖాపరంగా ఉన్న అధికారులకు తెలియజేసినట్లు వైద్యులు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



వైకేఎం కాలనీలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



వైకేఎం ఎస్‌జీఎం నగర్‌లో చేతికి తగిలేలా ఫ్యూజ్ బోర్డులు

- పలు ప్రాంతాల్లో లేని రక్షణ గోడలు
- పట్టించుకోని అధికారులు

పార్వతీపురంటౌన్: పట్టణ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కన, జనావాసాల మధ్యనే వాటిని ఏర్పాటు చేశారు. అయితే వాటికి రక్షణ కంచె వేయడం మరవడంతో, చిన్నారులు, స్థానికులు, రాకపోకలు సాగించేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవి తగిలి ప్రమాదం బారిన పడే ఆస్కారం ఉంది. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలి మూగజీవాలు మృతిచెందిన ఘటనలూ ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా స్థానిక లైన్‌మెన్, విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

బిక్కు బిక్కుమంటూ రాకపోకలు..

ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వాటికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బోర్డులు కూడా తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వలన రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అటువైపు వెళ్తున్న వాహన చోదకులు, చిన్నపిల్లలు తిరగడానికి భయపడుతున్నారు. చిన్న పిల్లలు బయటకు వచ్చేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలితే పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు అప్పుడప్పుడైనా ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి పిచ్చిమొక్కలు అల్లుకోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఆటు వైపు కన్నెత్తి చూడడం లేదు.

చాలా ప్రమాదకరంగా ఉన్నాయి

పట్టణంలోని వైకేఎం కాలనీ, ఎస్పీ ఆఫీసు దారి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద, బైపాస్‌రోడ్డుతో పాటు పలు మలుపుల దగ్గర ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి సమీపంలో అవి ఉండటంతో ట్రాక్టర్లు, బస్సులు, లారీలు, వాహనదారులకు ప్రమాదకరంగా ఉంటోంది. రోడ్డు మీదుగా ప్రయాణం సాగించే వాహనదారులు రాత్రి సమయల్లో ఇబ్బంది పడుతుంటారు. ఆదమరిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టే పరిస్థితి ఉంది. పిల్లలకు ఇబ్బందిగా ఉంటోంది.

– ఎం.సత్యం నాయుడు, వైకేఎం కాలనీ, పార్వతీపురం

ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ సిబ్బంది నిత్యం పరిశీలిస్తూ ఉంటారు. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. అవసరమైతే ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటకు మార్చడనికి చర్యలు తీసుకుంటాం. కొన్నిచోట్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్త దిమ్మెలు ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ తయారు చేస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– సీహెచ్ దివ్య, విద్యుత్ శాఖ పట్టణ, ఏఈ



బైపాస్ రోడ్డు వద్ద వద్ద ప్రధాన రహదారిపై ట్రాన్స్ ఫార్మర్



బైపాస్ కాలనీలో రోడ్డు పక్కన కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ప్రధాన రహదారిపై నెయ్యలవీధి కూడలి వద్ద ట్రాన్స్‌ఫార్మర్

ప్రభుత్వ పాఠశాలలో చేరండి

- గ్రామాల్లో ముమ్మర ప్రచారం



పలగరలో ప్రచారం చేస్తున్న బలిజిపేట ఉన్నత పాఠశాల ఆటో

బలిజిపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు పరిసరగ్రామాల్లో ఆటోతో ప్రచారకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోతోపాటు ఉపాధ్యాయులు ప్రచారంలో తిరుగుతూ పరిసరప్రాంతాల్లో ఉండే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను కలిశారు. బలిజిపేట, గుడివాడకాలనీ, పలగర, చిలకలపల్లి గ్రామాల్లో ఆటోతో ప్రచారకార్యక్రమం నిర్వహించడాన్ని గ్రామాల్లో ప్రజలు కొత్త తరహాలో చూశారు. ప్రభుత్వ పాఠశాలలు ఈ విధంగా ప్రచారం చేయడం ప్రజలలో కాస్తంత ఆలోచన కలిగించేలా మారింది. ప్రభుత్వ పాఠశాలలో చదివితే ఎటువంటి ప్రయోజనాలు సమకూరుతాయో ప్రచారంలో వివరించారు. అదేవిధంగా వంతరాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రదానోపాధ్యాయుడు సీహెచ్.వెంకటరమణ, ఉపాధ్యాయులు వివిధ రకాల పద్ధతుల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

దోమల నివారణకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



జానుమల్లువలసలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో దోమలు, అంటువ్యాధుల నివారణకు పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు జానుమల్లువలస పెదభోగిలి రైల్వేవంతెనపై జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, వ్యాధులు రావడానికి ప్రధాన కారణమైన దోమలను నివారించడానికి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అన్ని గ్రామాల్లో సామూహికంగా దోమలు నివారించాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామాల్లో పారిశుధ్యపనులు చేయించడం, వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, దోమల నివారణ మందు పిచికారీ చేయడం తదితర పనులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఏఎస్సై శ్రీనివాసరావు

సీతానగరం: ప్రాణహాని కలిగించే డ్రగ్స్ వాడకంతో వచ్చే దుష్పరిణామాలపై విద్యార్థులు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో ప్రచారం చేయాలని ఏఎస్సై లెంక శ్రీనివాసరావు, జిల్లా లీగల్ బృందం సభ్యుడు కృష్ణమోహన్ అన్నారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పార్వతీపురం మన్యం జిల్లా ఈగల్ బృందం ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఎం ఈల్లా ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, వాటిని నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించుకోవాలని హితవు పలికారు. అవగాహన కల్పించుకున్న విద్యార్థులంతా గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన వివరాలు ఇచ్చేందుకు "టోల్ ఫ్రీ నంబర్ 1972"కు తెలియజేయాలని చెప్పారు. అనంతరం డ్రగ్స్ నివారణకు తీసుకోవలసిన అంశాలతో కూడిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

లేబర్‌కోడ్స్ రద్దు చేసే వరకూ ఉద్యమం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథరావు

సీతానగరం: ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే విధంగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ చట్టాన్ని రద్దు చేసే వరకూ ఆందోళన చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మథ రావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన జిల్లాకమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భగా జిల్లా కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దయ్యే వరకూ కార్మికసంఘాలు ఐక్యంగా ప్రభుత్వంపై పోరాడడానికి సిద్ధం కావాలని కోరారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులు ప్రభుత్వం కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం, వారిచ్చిన కమీషన్ల కోసం పని చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కార్మికచట్టాలు, హక్కులు రద్దు చేసి కంపెనీలకు కట్టు బానిసలుగా మార్చడం తగదన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను రద్దు చేయడానికి జాతీయస్థాయిలో పోరాటం చేస్తామని అందుకు జూలై 9వ తేదీని నిర్ణయించినట్లు తెలియజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు వి.రమాలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు జీవనోపాధి కల్పించే పరిశ్రమల యాజమాన్యాలపై యూజర్ చార్జీల పేరుతో జీఎస్టీ అధిక మొత్తంలో విధించడంతో వేలాదిపరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీని ఫలితంగా బతుకు తెరువులేక కార్మికులందరూ రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంట జ్యోతి, రెడ్డి వేణు, జె.గౌరు, బి.అప్పారావు, సునీత, గౌరమ్మ, రెడ్డి రమణమూర్తి పాల్గొన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ఉల్లాసం దక్కుతుందన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు జె.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం 11కేవీ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యుత్ ఏఈ రామారావు తెలిపారు.

తల్లికి వందనం అందరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బలగ రమణమ్మ



తల్లికి వందనం అమలుపై ప్రశ్నిస్తున్న సభ్యుడు సింహాచలం

- మండల సమావేశంలో సభ్యుడి డిమాండ్

సీతానగరం: మండలంలోని ప్రజాసమస్యలపై మండల స్థాయి అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా దృష్టి సారించాలని ఎంపీపీ బలగ రమణమ్మ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ పద్దులపై ఎంఈఓలు జి.సూరిదేముడు, వెంకటరమణ మాట్లాడుతూ తల్లికివందనం పథకం ఆర్థిక సహాయాన్ని తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. సమావేశంలో మండలసభ్యుడు అక్కపోలు సింహాచలం మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా కొంతమంది తల్లుల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు పడ్డాయని, మరి కొంతమంది పేర్లు అర్హుల జాబితాలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పేర్లు లేని వారి వివరాలు అప్‌లోడ్ చేయడంలో లోపాలున్నాయని వాటిని సచివాలయాల్లో సరిచేసి అందరికీ తల్లికి వందనం డబ్బులు అకౌంట్లలో జయచేయనున్నట్లు ఎంఈఓ సూరిదేముడు సమాధానం ఇచ్చారు. వ్యవసాయ పద్దులపై ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ విషయమై సభ్యులు జగదీశ్వరరావు, వెంకటరమణ కలగజేసుకుని అన్ని రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు, ఉంచాలని కోరారు. విద్యుత్ పద్దులపై ఏఈ శశిభూషణరావు మాట్లాడుతూ గ్రామాలకు 24 గంటలు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి పనులు జరుగుతున్న కారణంగా సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతులు మూణ్నాళ్ల ముచ్చటే..!





ఇటీవల మంత్రి పర్యటన నిమిత్తం చేపట్టిన రోడ్డు మరమ్మతులు (ఫైల్), (ఇన్‌సెట్లో) కొద్దిరోజుల్లోనే రాళ్లు తేలి రహదారిపై బయటపడిన గుంతలు

- రోడ్డుపై రాళ్లు తేలిన గుంతలు

పార్వతీపురం రూరల్: ఇటీవల పార్వతీపురం మండలంలోని చిన్నబొండపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి టీడీపీ నేత నారాలోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ అంతర్గత సమావేశం నిమిత్తం రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్వతీపురం గోరీల జంక్షన్ నుంచి సమావేశం నిర్వహించే ప్రదేశం వరకు గుంతలతో ఉన్న రహదారికి ఆర్అండ్‌బీ అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్‌లు తాత్కాలిగా మరమ్మతులు చేశారు. అయితే నిత్యం ప్రజలు ఆ రహదారిలో అధ్వాన దుస్థితి కారణంగా అవస్థలు పడుతున్నా పట్టించుకోని అధికారులు. మంత్రి రాకతో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ కొద్ది రోజుల్లోనే రహదారి యథాతథ స్థితికి చేరుకుని రాళ్లు తేలి గుంతలు బయటపడ్డాయి. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులను వివరణ అడగగా గతంలో విడుదలైన నిధుల్లోనే కాంట్రాక్టర్లు ఈ తాత్కాలిక మరమ్మతులు చేపట్టారన్నారు. అలాగే రోడ్డు నిర్మాణం బకాయిల చెల్లింపు నిమిత్తం పంపిన నివేదికల మేరకు కొద్ది రోజుల్లో చెల్లింపులు జరగనున్నట్లు తెలిపారు. అయితే ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి వెంకంపేట గోరీల జంక్షన్ వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన జరగ్గా కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం బకాయిల చెల్లింపులు ఆలస్యం కారణంగా పనుతుల నిలిచిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

గ్రానైట్ తవ్వకాలతో సాగునీటి ఎద్దడి

- సీపీఎం నాయకుడు పి.రాము



బడిదేవర కొండపై నుంచి కిందికి పారుతున్న వర్షపు నీటిని చూపిస్తున్న సీపీఎం నాయకుడు రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ పంచాయతీ పరిధిలో ఉన్న బడిదేవర కొండ వందలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఓ కంపెనీకి గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంతో కొండపై జరిగిన భారీ గ్రానైట్ తవ్వకాల్లో వర్షపు నీరు ఇంకి వృథాగా పోతోంది. పార్వతీపురం ప్రాంతానికి బడిదేవరకొండ ఎంతో అవసరం. వర్షాకాలంలో విశాలమైన ఈ కొండపై కురిసిన వర్షాలకు నీరంతా కిందికి పారి చుట్టుపక్కల ఉన్న వందల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం గ్రానైట్ తవ్వకాలతో పరిస్థితి భిన్నంగా మారిందని సీపీఎం నాయకుడు పి.రాము ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎన్నో మార్లు విన్నవించిన సమస్య పట్టనట్లు వ్యవహరిస్తుందన్నారు. రానున్న రోజుల్లో లీజుకు తీసుకున్న సంస్థ ద్వారా తవ్వకాల పరిధి పెరిగి కిందికి వర్షపు నీరు రాక వందలాది ఎకరాలు ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

హామీల అమలులో మోసం

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నాయకుల విమర్శలు
- జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ



సాలూరు: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి 99 శాతం హామీలను జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో అమలుచేయగా, టీడీపీ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమవుతున్నారని వైఎస్సార్‌సీపీ సాలూరు మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్, వైస్ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనువాసరావు తదితరులు విమర్శించారు. జగన్‌అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కోలపల్లి త్రినాథనాయుడు, సువ్వాడ రామకృష్ణ, అల్లు సూరప్పలనాయుడు, లక్ష్మణ్, కల్యాణ్, రామ్మూర్తి, జయసింహ, వేణు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనలో ప్రజల అవస్థలు

బలిజిపేట: కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఈ పాలనలో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయని వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండలశాఖ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు ఏడాది కూటమి పాలనపై జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీటీసీ జి.ప్రభావతి,జి.పకీరునాయుడు, సత్యంనాయుడు, వాసుదేవరావు, బి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు రక్షణ కరువు

పార్వతీపురం టౌన్: కూటమి పాలనలో ప్రజలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పురపాలక సంఘం స్థాయిలలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనంతా విధ్వంసమే, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్నే అమలు చేస్తున్నారన్నారు. వాస్తవాలు, ఆధారాలతో సహా వైఎస్సార్‌సీపీ పుస్తకాన్ని ప్రచురించిందని చెప్పారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, కౌన్సిలర్‌లు చీకటి అనూరాధ, యడ్ల త్రినాథ, వందాన నేతాజీ, తెలుగు బోదయ్య, జిల్లా పార్టీ ప్రతినిధులు పాత గౌరీ శంకరరావు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు చందాన ఆనంద్, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు కోరాడ శేఖర్, కాగాన ప్రకాష్, పట్టణ పార్టీ ప్రతినిదులు బోను ఆదినారాయణ, ఏస్ సందీప్ కుమార్, శనాపతి చంద్ర, ధర్మవరపు గురుమూర్తి, కందాపు సోంబాబు, పత్తిగుళ్ల రాము, కిషోర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో పుస్తకావిష్కరణ

పాచిపెంట: జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని పాచిపెంట మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు , ప్రజాప్రతినిధులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైస్ ఎంపీపీ రవీంద్ర, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పార్వతీపురం టౌన్: పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ



పాచిపెంటలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు